ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శనివారం 20 జూలై 2024





సర్వమంగళ అలంకరణలో అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 19: భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొనసాగుతున్న శాకంబరీ ఉత్సవాలు శుక్రవారానికి 14వ రోజుకు చేరాయి. ఉదయం నిత్య పూజ నిర్వహించిన అనంతరం తిథి మండల దేవత యజనంలో భాగంగా ఉత్సవమూర్తికి ఇచ్ఛా శక్తిగా మాత్ర అలంకరణ చేసి పూజలు చేశారు. జ్ఞానశక్తి అయిన భద్రకాళి అమ్మవారికి సర్వమంగళ అలంకరణ చేసి పూజ ఆరాధన చేశారు. దశమహా విద్యలలో త్రయోదశికి ఆది దేవత మన్మథుడని, అమ్మవారి విభూది సర్వమంగళగా భక్తులకు సమస్త మండలాలను, శుభములను భక్తులకు అందజేస్తుందని అర్చకులు తెలిపారు. ఈనెల 21అమ్మవారి శాకంబరీ అలంకరణను పురస్కరించుకొని కూరగాయలు, పండ్లు సమర్పించుకున్న భక్తులు శనివారం సాయంత్రంలోగా ఆలయ కార్యాలయంలో అందజేయాలని ఈవో శేష భారతి కోరారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి

బొగత.. జలసవ్వడుల పులకరింత..

తెలంగాణ నయాగరాగా పేరొందిన ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు, మూడు రోజులుగా తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వస్తున్న వరదలతో బొగత ఉప్పొంగుతోంది. జలపాతం ముందరి భాగంలోని ట్రీహౌస్ వరకు వరద నీరు చేరగా.. అల్లంత ఎత్తునుంచి దుంకుతున్న జలధారలను చూసి సందర్శకులు పులకరిస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ, జలపాతం అందాలను కెమెరాలలో బంధిస్తూ మురిసిపోతున్నారు.

- వాజేడు

మోస్తరు వాన

హనుమకొండ జిల్లాలో 23.5మి.మీ, వరంగల్ జిల్లాలో 20.7 మిమీ వర్షపాతం

హనుమకొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ , వరంగల్ జిల్లాలో గురువారం రాత్రి నుంచి మోస్తరు వానలు పడ్డాయి. ఈ క్రమంలో హనుమకొండ జిల్లాలో సరాసరి 23.5 మిల్లీమీటర్లు, వరంగల్ జిల్లాలో 20.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో అత్యధికంగా 39.3 మిమీ వర్షం పడగా భీమదేవరపల్లి మండలంలో 22.1, వేలేరులో 20.1, ఎల్కతుర్తిలో 21.5, హసన్‌పర్తిలో 24.1, ధర్మసాగర్‌లో 18.4, కాజీపేటలో 23.6, హనుమకొండలో 18.4, ఐనవోలులో 13, పరకాలలో 18.9, దామెరలో 24.7, ఆత్మకూరులో 27.6, శాయంపేటలో 25.3 మిమీ వర్షం పాతం నమోదైంది. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో అత్యధికంగా 42.8మిమీ వర్షం కురిసింది. గీసుకొండలో 35.4, దుగ్గొండిలో 22.4, నల్లబెల్లిలో 16.2, నర్సంపేటలో 17.2, ఖానాపూర్‌లో 18, చెన్నారావుపేటలో 3.6, సంగెంలో 14.8, వర్ధన్నపేటలో 19.6, పర్వతగిరిలో 18.6, నెక్కొండలో 10.2, ఖిలా వరంగల్‌లో 22,4, వరంగల్‌లో 28మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో సగటున 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక జనగామ జిల్లాలో చిరుజల్లులు మాత్రమే పడ్డాయి.

జయశంకర్‌భూపాలపల్లి, ఏజెన్సీ జిల్లా అయిన ములుగు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ములుగు జిల్లాలో 59మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద పోటెత్తింది. సమ్మక్క బ్యారేజీకి 4లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా అంతే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు.

నిబద్ధతతో పని చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్, జూలై 19: అధికారులందరూ నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆరు మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, జీపీ ప్రత్యేక అధికారులతో పంచాయతీరాజ్ యాక్ట్ 2018 పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ అధికారులందరూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకోని వెళ్లాలన్నారు. ప్రతి బుధవారం అంగన్వాడీల సందర్శన, గురువారం పాఠశాలల తనిఖీలు, మంగళవారం డ్రై డే నిర్వహించాలని, శుక్రవారం మొక్కల సంరక్షణకు వాటరింగ్ డే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వీధి కుక్క కాట్లపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల ద్వారా అర్హులైన మహిళలను గుర్తించి రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జేడ్పీ సీఈవో అనిల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు (ఫైల్)

చేపపిల్లల పంపిణీకి సర్కారు సై

- అనుమానాలకు తెర.. మత్స్యకారులకు ఊరట
- జిల్లాలో 2.72 కోట్ల చేపపిల్లల విడుదలే లక్ష్యం
- జిల్లాలో 9 రిజర్వాయర్లు, 732 చెరువులు
- 169 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు
- 16 వేల 868 మంది సభ్యులు

రఘునాథపల్లి, జూలై 19: చేపపిల్లల పంపిణీపై నెలకొన్న నీలినీడలు ప్రభుత్వ నిర్ణయంతో తొలిగిపోయాయి..రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లల పంపిణీపై మొన్నటి వరకు నెలకొన్న అనుమానాలు పటాపంచలయ్యాయి. ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఈ సారి ఉంటదో.. ఉండదో అని అయోమయానికి గురైన మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఊరటనిచ్చింది. జిల్లాలో గల రిజర్వాయర్లు, చెరువులు, కుంటలలో చేప పిల్లలు పోసేందుకు, వాటిని సరఫరా చేసే కాంట్రాక్టర్ల కోసం రాష్ట్ర స్థాయిలో ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించే ప్రక్రియను ప్రారంభించింది. ఈ నెల 23వ తేదీ వరకు టెండర్లను స్వీకరించి, అనంతరం టెండర్లు దాఖలు చేసిన కాంట్రాక్టర్లకు ఏ మేరకు అర్హతలున్నాయో సాంకేతిక కమిటీ పరిశీలించిన తర్వాత తక్కువ ధర కోట్ చేసే కాంట్రాక్టర్లకు చేప పిల్లలు పంపిణీ చేసే టెండర్లను కట్టబెట్టనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయితే ఆగస్టు నెల రెండో వారం నుంచి మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

2.72 కోట్ల పిల్లల పంపిణీ లక్ష్యం..

జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి యాక్షన్ ప్లాన్ ప్రకారం రూ.3.13 కోట్లతో 2 కోట్ల 72 లక్షల 72 వేల చేప పిల్లలను రిజర్వాయర్లు, చెరువులు, కుంటలలో వదలాలని నిర్ణయించారు. చేప పిల్లల టెండర్ ప్రక్రియలో 35 నుంచి 40 మిల్లీమీటర్ల సైజులో చేప పిల్లలకు ఒక్కొక్కటి 61 పైసల చొప్పున, 80 నుంచి 100 మిల్లీమీటర్ల సైజులో ఉన్న చేప పిల్లలకు ఒక్కొక్కటి రూ.1.63 చొప్పున ధర నిర్ణయించారు. 35 నుంచి 40 మిల్లీమీటర్ల సైజు 1.29 కోట్ల చేప పిల్లలు, 80 నుంచి 100మిల్లీమీటర్ల సైజు 1.43 కోట్ల చేప పిల్లలకు టెండర్లు పిలుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 9 రిజర్వాయర్లు, 732 చెరువులు, కుంటలు ఉన్నాయి.వీటిలో ఈ ఏడాది 2 కోట్ల 72 లక్షల 72 వేల చేప పిల్లలను పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో 169 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా , ఇందులో 141 పురుషుల సహకార సంఘాలు, 28 మహిళ సహకార సంఘాలు ఉన్నాయి. 169 సంఘాల్లో 16 వేల 868 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. చెరువులు, కుంటల్లో వేసే చేప పిల్లలు నిబంధనల మేరకు 35 ఎంఎం నుంచి 40 ఎంఎం, రిజర్వాయర్‌లలో వేసే చేప పిల్లలు 80 ఎంఎం నుంచి 100 ఎంఎం సైజు ఉండాలి. ప్రస్తుతం జిల్లాలో సాధారణ వర్షపాతం మాత్రమే నమోదయింది. దీంతో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపల పెంపకానికి సరిపడా నీళ్లు లేవు. భారీ వర్షాలు పడితే గానీ నీటి వనరులు నిండే పరిస్థితి లేదు. వర్షాలు పడే లోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఆగస్టు నెల రెండో వారంలో చేప పిల్లలు పంపిణీ చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.



చేప పిల్లలు (ఫైల్)

పంపిణీ సకాలంలో జరగాలి..

- నీల ఆగయ్య, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, ఆశ్వరావుపల్లి



జిల్లాలో సకాలంలో చేప పిల్లల్ని పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీకి టెండర్లు ఆహ్వానించడం మత్స్యకారులకు ఆనందాన్నిచ్చింది. మత్స్యకారులకు ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను అందించాలి. చెరువులలో పాతుకపోయిన నాచు, కంప ముళ్లు, తొలగించడానికి జిల్లాకు ఒక బోటు హార్వెస్టర్‌ను ప్రభుత్వం సబ్సిడిపై అందించాలి. రైతు భరోసా తరహాలో రూ.5 లక్షల భీమా సౌకర్యం కల్పించాలి.

టెండర్లను ఆహ్వానించాం..

- బానోతు నాగులు నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి



జిల్లా వ్యాప్తంగా 2024-25 సంవత్సరానికి గాను ప్రభుత్వ నిర్ణయం మేరకు పకడ్బందీగా ఉచిత చేప పిల్లలను సకాలంలో పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా దృష్టి సారించాం. ఇప్పటికే జిల్లాలో 2.72 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం .ఇందుకు అనుగుణంగా రాష్ట్ర స్థాయిలో టెండర్ల ప్రక్రియ ప్రారంభమయింది. ఈ నెల 23వ తేదీ వరకు టెండర్లు స్వీకరిస్తారు.

నవాబుపేట వద్ద పశువ్యాపారుల రాస్తారోకో

నిబంధనల పేరిట పలువురు వేధిస్తున్నారని ఆందోళన

జనగామ-సూర్యాపేట జాతీయరహదారిపై స్తంభించిన ట్రాఫిక్

ఐదుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు



నవాబుపేట వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న పశువుల వ్యాపారులు

లింగాలఘణపురం, జూలై19: లింగాలఘణపురం మండలం నవాబుపేట వద్ద జనగామ- సూర్యాపేట జాతీయ రహదారిపై శుక్రవారం పశు వ్యాపారులు సుమారు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనకారులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతలో కొనుగోలు చేసిన పశువులను ట్రాలీ, డీసీఎం, ఇతర వాహనాల్లో రవాణా చేస్తుండగా పలువురు వ్యక్తులు తమను తరుచూ వెంబడిస్తూ హిందుత్వ సంఘాల పేరిట డబ్బుల వసూలుకు దిగుతున్నారని, ఇవ్వకపోతే గోశాలకు పంపిస్తూ తమను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ కొనుగోళ్లను నిలిపేసి హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు ఆందోళనకు దిగారు. అంతటితో ఆగకుండా పలువురు రైతులను రెచ్చగొట్టి జనగామ-సూర్యాపేట జాతీయరహదారిపై రాస్తారోకో చేపట్టి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో సుమారు గంటపాటు వంద లాది వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి ఆందోళనకారులను చెదరగొట్టారు. వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా ఆందోళనకు దిగి రాస్తారోకో చేసిన ఏడుగురు వ్యక్తులు బండి వీరస్వామి, ఉడుతల నరేశ్, ఎండీ సోహెల్, ఎండీ ఖదీర్, భూక్యా బాలక్రిష్ణలపై లింగాలఘణపురం ఎస్సై చింత రాజు కేసు నమోదు చేశారు.

వ్యాపారుల తీరుతో టెండర్‌దారుల్లో టెన్షన్..

ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద పశువుల సంతగా గుర్తింపు పొందిన నవాబుపేట శ్రీకోదండ రామస్వామి దేవస్థాన పశువుల సంత ద్వారా దేవాలయానికి ప్రతీ ఏటా కోటికిపైగా ఆదాయాన్ని సమకూరుస్తుంది. ప్రతీ శుక్రవారం జరిగే పశువుల సంతలో ఏటా సుమారు 50వేల పశువుల అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఈనేపథ్యంలో ఏడాది కాలపరిమితికి రూ. 1.05 కోట్లు హెచ్చు పాటతో పశువుల సంత రహదారి వేలం హక్కులు పొందిన టెండర్‌దారులకు ఇప్పుడు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గత పదేళ్లుగా సగటున వారానికి వెయ్యి పశువుల క్రయవిక్రయాలు జరుగుతున్న నవాబుపేట సంతలో గడిచిన రెండు మాసాలుగా పశువుల వ్యాపారులు కనీసం 400 పశువులను కూడా కొనుగోలు చేయడం లేదని టెన్షన్‌కు గురవుతున్నారు. దీంతో వారానికి సుమారుగా రూ. 2.5 లక్షల వసూలు కావాల్సిన టెండర్ డబ్బుల్లో రూ. లక్ష కూడా వసూలు కావడం లేదని ఆందోళన చెందుతున్నారు. గడిచిన రెండేళ్లుగా కొనసాగిన క్రయవిక్రయాలను అంచనా వేసుకుని టెండర్‌లు వేశామని ఇప్పుడు వ్యాపారులు పశువులను కొనుగోలు చేసేందుకు వెనకడుగు వేస్తున్న నేపథ్యంలో తాము భారీగా నష్టపోవాల్సి వస్తుందని టెండర్ దారులు మనోవేదనకు గురవుతున్నారు. వెంటనే దేవాదాయ శాఖ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పల్లెబాటలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



రేగులతండాలో ఓ గుడిసెలో మహిళతో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

కొడకండ్ల జూలై 19 : మండలంలోని రేగుల, రేగుల తండా, మొండ్రాయి గ్రామాల్లో ఎంఎల్యే యశస్విని రెడ్డి మండల అధికారులతో కలిసి శుక్రవారం పల్లెబాట నిర్వహించారు. గ్రామాల్లోని వీధులు తిరిగి ప్రత్యక్షంగా ప్రజలను కలుసుకుని క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకున్నారు. రేగుల తండాలో దేవుని మాన్యం సాగు చేసకుంటున్న రైతులు పట్టాలు ఇప్పించాలని కోరగా దేవాదాయశాఖ నుంచి వివరాలు తెలుసుకుంటానని తెలిపారు. గ్రామపంచాయతీ భవనాన్ని పూర్తి చేయాలని, అంగన్‌వాడీ సెంటర్‌కు సొంతభవనం కావాలని స్థానికులు కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలను ఆమె తీసుకుని చిన్న సమస్యలకు అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. చాలామంది పెన్షన్లకై దరఖాస్తులు అందజేశారు వనమహోత్సవంలో భాగంగా రేగులతండాలో ఆమె మొక్కను నాటారు. మొండ్రాయిలో 16 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ప్రజలు అందజేశారు. ఒక జాతీయ బ్యాంకు కావాలని మొండ్రాయి ప్రజలు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు డి.సురేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజ కవర్గ అధ్యక్షుడు రాజేష్ నాయక్, బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి, ఎంఆర్వో అంజయ్య, ప్రత్యేక అధికారి రవీందర్, డీఈ సంధ్య, ఏపీవో కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాల శీతలీకరణ కేంద్ర డీడీ బదిలీ

జనగామ రూరల్, జూలై 19: జనగామ పాల శీతలీకరణ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా పని చేసిన ధన్‌రాజ్ నాగర్ కర్నూర్‌కు బదిలీ అయ్యారు. అయన స్థానంలో నాగర్ కర్నూల్‌లో పని చేస్తున్న సత్యనారాయణ యాదవ్ జనగామకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాధం రమేష్ బదిలీపై వెళ్తున్న ధన్‌రాజ్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఏ ఉద్యోగంలోనైనా బదిలీలు సహజమని, కానీ తాను చేసే పనితీరును బట్టి అక్కడి ప్రజల మనసులో ఉండిపోతారన్నారు. ఎక్కడ ఉద్యోగం చేసిన పాడి రైతులతో కలిసి విజయ డైరిని ముందుకు తీసుకోని వెళ్లాలన్నారు.

రూ. 84వేల గుట్కా ప్యాకెట్ల సీజ్

లింగాలఘణపురం, జూలై 19: లింగాలఘణపురం మండలం పటేల్‌గూడెం వద్ద పాలకుర్తి క్రాస్‌రోడ్డు సమీపాన టీ స్టాల్‌పై దాడులు నిర్వహించిన పోలీసులు నిషేధిత గుట్కాప్యాకెట్లను సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటేల్‌గూడెం వద్ద మహేశ్ అనే టీ స్టాల్ నిర్వాహకుడు నిషేధిత గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న లింగాలఘ ణపురం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో మహేశ్ వద్ద గుట్కా ప్యాకెట్లు లభ్యం కావడంతో వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారని విచారణ చేపట్టగా జనగామ పట్టణానికి చెందిన యాకూబ్ అనే వ్యక్తి వద్ద రహస్యంగా కొనుగోలు చేశానని తెలిపాడు.

దీంతో అతన్ని వెంటబెట్టుకున్న పోలీసులు జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో యాకూబ్ ఇంటిపై దాడులు నిర్వహించి రూ. 84,560 విలువైన గుట్కా ప్యాకెట్లను సీజ్ చేశారు. నిందితులు మహేశ్, యాకూబ్‌లపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కళ్యాణలక్ష్మి చెక్కులు తీసుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి, జూలై 19: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సంపూర్ణాభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తహసీల్దార్ పురం యుగేందర్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని 160 మందికి రూ 1.60 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు 28 మందికి రూ.5.23 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే మొదటిసారిగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఘనత సిఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. కేంద్రంలో వరుసగా మూడుసార్లు అధికారం చేపట్టిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఏనాడు రైతు సంక్షేమం కోసం ఆలోచించిన దాఖలాలు లేవని, బ్యాంకుల్లో రూ.కోట్లు రుణాలు తీసుకొని ఎగనామం పెట్టిన అనిల్ అంబాని లాంటి బడాబాబులకు రూ.13 లక్షల కోట్లు మోదీ మాఫీ చేశాడు తప్ప రైతు సంక్షేమం కోసం కృషి చేయకపోవ డం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు జనగామ ఆర్డీవో కొమురయ్య, మాజీ జడ్పీటీసీలు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మారజోడు రాంబాబు, బొల్లం అజయ్‌మణికంఠ, మాజీ ఎంపిపి మేకల వరలక్ష్మినరేందర్, పోకల శివకుమార్, గొరిగె రవి, రంగోజు ఈశ్వరయ్య, చీమలపాటి రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ డీఎంహెచ్‌వో బదిలీ



బదిలీ అయిన హరీష్‌రాజ్

జనగామ, జూలై19(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ శుక్రవారం బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఆయనను జనగామ నుంచి మంచిర్యాల డీఎంహెచ్‌వోగా బదిలీ చేసింది. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఆర్ఎంవోగా పని చేస్తున్న హరీష్‌రాజ్‌ను జనగామ ఇంచార్జీ డీఎంహెచ్‌వోగా మార్చి 12న ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేయగా మార్చి 14న బాధ్యతలు స్వీకరించారు. నాలుగు మాసాల పాటుగా జనగామ డీఎంహెచ్‌వోగా పనిచేశారు. కాగా ఆయన స్థానంలో ప్రస్తుతానికి ఎవరికీ బాధ్యతలు అప్పగించలేదు.



బదిలీలు రద్దు చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

బల్దియా కార్మికులకు బదిలీల గండం

75ఏళ్లలో ఎప్పుడూ చేయలేదని ఆవేదన

నేడు సీఎంను కలువనున్న యూనియన్ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 19: బల్దియా పారిశుధ్య కార్మికులకు బదిలీల టెన్షన్ పట్టుకుంది. గురువారం 445 మంది కిందిస్థాయి ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో చాలామంది అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా, మరికొందరు ఏకంగా అంబులెన్స్‌లలో కౌన్సెలింగ్‌కు వచ్చిన పరిస్థితి ఉంది. ప్రధానంగా 30 కేటగిరీలలో పనిచేస్తున్న 445 మంది ఉద్యోగుల్లో ఎక్కువగా దళిత సామాజిక వర్గానికి చెందిన వారు ఉండడంతో ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే 75 యేళ్ల వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో నాలుగోతరగతి ఉద్యోగులకు ఎన్నడూ బదిలీలు జరగలేదని అంటున్నారు.

నేడు చలో హైదరాబాద్

గ్రేటర్ వరంగల్ పరిధిలో ఎన్నడూ లేని విధంగా నాలుగో తరగతి ఉద్యోగులను బదిలీ చేయడం సరైంది కాదని తెలంగాణ మునిసిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు ఇటీవల కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియంశ్రీహరిని కలిసి సమస్యలు వెల్లడించారు. వారు సైతం సానుకూలంగా స్పందించినా బదిలీల తంతు ఆగడం లేదు. దీంతో శనివారం ఉద్యోగ సంఘాలు, ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు హైదరాబాద్‌కు వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలువనున్నట్టు తెలిపారు. అంతేకాకుండా బదిలీల తీరుపై హైకోర్టును ఆశ్రయించి బదిలీల రద్దుకు పోరాటం చేస్తామని సంఘం నాయకులు బొట్ల బిక్షపతి మాదిగ, ధర్మరాజులు తెలిపారు.

విద్యుత్‌తో జాగ్రత్త

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఈలు మధుసూదన్‌రావు, వెంకటరమణ



హనుమకొండ టౌన్, జూలై 19: విద్యుత్ ప్రమాదాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా వ్యహరిస్తూ నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని వరంగల్, హనుమకొండ ఎస్ఈలు మధుసూదన్‌రావు, వెంకటరమణ సూచించారు. గ్రామాల్లోని వినియోగదారులు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేసే లైన్‌మెన్, సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్, ఏఈల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రమాదాల నుంచి బయటపడాలంటే కింది జాగ్రత్తలను పాటించాలని వినియోగదారులకు సూచించారు.

- వ్యవసాయం నిమిత్తం రైతులు పంపుసెట్లను వినియోగిస్తున్నప్పుడు కరెంట్ మోటార్లు కానీ, పైపులు కానీ, ఫుల్‌వాల్వులను అశ్రద్ధతో తాకొద్దు. ఆ సమయాల్లో విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- వర్షాలు కురిసినప్పుడు విద్యుత్‌స్తంభాలను, తెగిపడిన తీగలను, స్టాటర్లును, మోటార్లను తాకొద్దు. వేలాడుతున్న కరెంట్ తీగల గురించి మీకు దగ్గర్లోని కరెంట్ ఆఫీస్, సంబంధిత అధికారులకు తెలియజేయాలి.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌పార్మర్‌ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- సర్వీస్ వైర్లను వీధి దీపాలను సరిచేసేందుకు ఇతరులు విద్యుత్ స్తంభాలను ఎక్కొద్దు. విద్యుత్ సిబ్బంది సహాయం తప్పనిసరిగా తీసుకోవాలి.
- ఇంటి వరండాలో మరియు ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్ దగ్గరలో (జీఐ) వైరును దండెముగా కట్టి తడిబట్టలను ఆరవేయడం ప్రమాదకరం. ఎవరికైనా కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరగా ఉన్న వ్యక్తులు షాక్ గురైన వ్యక్తులను రక్షించాలన్న ఆతృతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ముట్టుకోరాదు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని వస్తువులను వాడటమే సరైన పరిష్కారం.
- చేపల వేటకు విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన షాక్‌కు గురై చనిపోతున్నారు. చేపలు పట్టడానికి విద్యుత్ తీగలు వాడరాదు.
- బోరు వేస్తున్నప్పుడు విద్యుత్ వైర్లు తాకి కొంతమంది చనిపోతున్నారు. బోర్లు వేస్తున్నప్పుడు పైన విద్యుత్ వైర్లు ఉన్నాయా లేదా అని ఒక సారి చూసుకొని జాగ్రత్తగా బోర్లు వేసుకోవాలి.
- జెండాలు ఎగుర వేస్తున్నప్పుడు జెండా పైపులు పైన విద్యుత్ వైర్‌కు తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వరికోతల సమయంలో హార్వెస్టర్స్‌కు విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడటంతో షాక్‌కు గురై చనిపోతున్నారు. చార్జింగ్ బంద్ చేసి మాట్లాడాలి.
- జంతువుల నుంచి పంట రక్షణ కోసం విద్యుత్ ఫెన్సింగ్ వేస్తున్నారు. ఇది చట్టరిత్యా నేరం. విద్యుత్ కంచెలు వేయరాదు.

కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి..

ప్రొఫెసర్ కంచ ఐలయ్య



సదస్సులో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

కాళోజీ జంక్షన్, జూలై 19: హనుమకొండ బాలసముద్రంలోని కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలని అక్కడే గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హరిత కాకతీయ హోటల్‌లో 'తెలంగాణ ఉద్యమం - గద్దర్ పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సుకు డీఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ అధ్యక్షత వహించారు. కళాక్షేత్రం ప్రారంభం కాకముందే పేరు పెట్టడం సరైంది కాదని ఆయన అన్నారు. గద్దర్ అంటే కేవలం ఒక ప్రాంతానికి, వర్గానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరి మనిషి అని ఐలయ్య అన్నారు. కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టకుంటే, విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వకపోతే ఉద్యమాలు చేసి సాధించుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర సాహిత్య యువ పురస్కార్ అవార్డు గ్రహీత పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ విషయంపై పట్టించుకోకుంటే పోరాడి సాధించుకుంటామని తెలిపారు. సమావేశంలో ఇంకా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, టీజీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కాడపాక రాజేందర్, పలు విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు.

రేపు నేత్ర, అవయవ, శరీరదాన ఐక్య వేదిక సమావేశం

కాళోజీ జంక్షన్, జూలై 19: నేత్ర, అవయవ, శరీరదాన రాష్ట్ర ఐక్య వేదిక సమావేశం ఆదివారం హనుమకొండలోని గోపాల్‌పూర్ జంక్షన్ సమీపంలోని అభి నిలయంలో నిర్వహిస్తున్నట్లు ఐక్య వేదిక వరంగల్ జిల్లా డైరెక్టర్ కొన్‌రెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ గంజి ఈశ్వరలింగం, కో కన్వీనర్ రాంకల్యాణ్, ప్రముఖ డాక్టర్ దాసరి ప్రసాదరావు, పలు సేవా కార్యక్రమాల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నేత్ర, అవయవ, శరీరదాన ప్రాముఖ్యతను, భావజాలాన్ని వ్యాప్తి చేయడం సమావేశ ఉద్దేశమని మల్లారెడ్డి వివరించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాలొనాల్సిందిగా ఆయన కోరారు. సమావేశ వివరాల కోసం సెల్ నంబర్లు: 87905 48706 / 97037 38699 లను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీ డ్రైవర్ ఆత్మహత్య


మర్కండి వేణు (ఫైల్)

మట్టెవాడ, జూలై 19: ఆర్థిక ఇబ్బందులు తాళలేక లారీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన హంటర్ రోడ్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో జరిగింది. మట్టెవాడ సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం. నగరంలోని హంటర్‌రోడ్ ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన మర్కండి వేణు (54) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు పని నిమిత్తం బయటికి వెళ్లిన వేణు భార్య స్వరూపకు సమాచారం అందించారు. ఆమె వచ్చిన వెంటనే ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వేణుకు భార్య స్వరూప, కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దామెర, జూలై 19 : దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన బిల్లా సురేందర్ రెడ్డి, బిల్లా దివ్యలు ద్విచక్రవాహనంపై హనుమకొండ కు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒగ్లాపూర్ స్టేజి వద్ద ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ప్రమాదవ శాత్తు కిందపడిపోయారు. దీంతో తీవ్రగాయాలైన క్షతగాత్రులను 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

చదరంగ వీరులు

- చెస్‌లో రాణిస్తున్న ఓరుగల్లు అణిముత్యాలు
- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న అర్జున్, రాజారిత్విక్, సరయు



నేడు అంతర్జాతీయ చదరంగ దినోత్సవం

వరంగల్ స్పోర్ట్స్, జూలై 19: చదరంగం అంటేనే ప్రత్యర్థి కదలికను గమనిస్తూ ఎత్తుకు పైఎత్తు వేస్తూ వ్యూహాత్మకంగా ఆలోచిస్తూ చిత్తు చేయడం. అంతేకాకుండా ప్రత్యర్థి ఆలోచనల్ని విభిన్న కోణాల నుంచి పసికడుతూ విజయం వైపు దూసుకెళ్లాల్సి ఉంటుంది. మైండ్‌గేమ్‌గా ప్రాచుర్యం పొందిన చెస్‌లో రాణించాలంటే చిన్నతనం నుంచి ఆట పట్ల ఆసక్తి, ఏకగ్రాత, క్రమశిక్షణ, నిబద్ధత తప్పనిసరిగా ఉంటేనే సాధ్యమవుతుంది. 1966 జూలై 20న యునెస్కో ఆలోచన మేరకు ఫిడే ఆదేశాలతో తొలిసారిగా అంతర్జాతీయ చదరంగం (చెస్) దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. దీంతో యేటా భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలలో చదరంగ దినోత్సవ వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఈ మేరకు శనివారం అంతర్జాతీయ చదరంగం (చెస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలువురు చెస్ దిగ్గజాలు, గ్రాండ్ మాస్టర్లు, (జీఎం)లు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.

జిల్లా కుసుమాలు

ప్రపంచ స్థాయిలో ఆదరణ పొందిన చెస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడకారులు సత్తా చాటుతున్నారు. అర్జున్, రాజరిత్విక్, సరయులు అంతర్జాతీయ చెస్‌లో రాణిస్తూ వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చిన్న వయస్సులోనే గ్రాండ్ మాస్టర్లుగా అర్హత సాధించి రాష్ట్రానికి, జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తున్నారు. హనుమకొండ నగరానికి చెందిన ఇరిగేసి అర్జున్ 15 ఏళ్లకే క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్‌లో రాష్ట్రం నుంచి తొలి గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదాను సాధిం చాడు. ప్రపంచస్థాయి క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్ లో 4వ స్థానంలో నిలవగా, భారతదేశం నుంచి క్లాసికల్ ఫిడే రేటింగ్‌లో తొలి స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించాడు. అదే విధంగా నగరానికి చెం దిన మరో అంతర్జాతీయ చెస్ దిగ్గజం రాజావరం రాజారిత్విక్.. తన తండ్రి స్వతహాగా చెస్ క్రీడాకా రుడు కావడంతో 6ఏళ్ల వయస్సులో కోచ్ బొళ్లం సంపత్‌కుమార్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్‌లో 17ఏళ్ల వయస్సులోనే తెలంగాణ నుంచి రెండో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. అలాగే మొండ్రాయి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సరయు చిన్నతనంలోనే చెస్ క్రీడ పట్ల అసక్తి పెంచుకుంది. ఇది గమనించిన తండ్రి చెస్‌లో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించుకున్నాడు. కోచ్ బొళ్లం సంపత్ వద్ద శిక్షణ తీసుకుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చెస్‌పోటీల్లో పాల్గొని ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదాను అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. పేద కుటుంబంలో జన్మించిన సరయు అర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా ఐఎం హోదాను సాధించి 3 నార్మ్‌లు చెస్‌లో పాల్గొని అత్యధిక ఫిడ్ చెస్ రేటింగ్ సాధించి గ్రాండ్ మాస్టర్ హోదా సాధించే అవకాశం దగ్గరలోని ఉంది.

క్రీడాకారులను ప్రోత్సహించాలి..

చెస్ క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోతున్నారని సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెస్ మేధావులను ప్రభుత్వం గుర్తించి ఆదరిస్తే మరెన్నో అద్భుతాలను సృష్టించే అవకాశం ఉందంటున్నారు. చదరంగంలో రాణించాలంటే క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఆదరిస్తే మరికొంత మంది క్రీడాకుసుమాలు అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉందంటున్నారు.

చాంపియన్‌షిప్ సాధించడమే లక్ష్యం

ఇరిగేసి అర్జున్, చెస్ గ్రాండ్ మాస్టర్ హనుమకొండ



25వ అబుదాబీ చెస్ ఫెస్టివల్, మాస్టర్స్ టోర్నమెంట్‌లో మూడో నార్మ్‌లో విజయం సాధించి గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల పర్యవేక్షణతోనే జీఎం హోదాను సాధించాను. ఫిడే రేటింగ్‌లో ప్రపంచ చాంపియన్‌గా ఉన్న మాగ్నస్ కార్ల్‌సన్ పై విజయం సాధించి ప్రపంచ చెస్ చాంపియన్ సాధించడమే నా లక్ష్యం.

సూపర్ గ్రాండ్ మాస్టర్ సాధిస్తా..

రాజావరం రాజారిత్విక్, చెస్ గ్రాండ్ మాస్టర్



మైండ్ గేమ్ అయిన చెస్ రాణించాలంటే ఏకాగ్రత తప్పనిసరి. 17ఏళ్ల వయస్సులో రాష్ట్రం నుంచి రెండో చెస్ గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించాను. సూపర్ గ్రాండ్ మాస్టర్‌గా నార్మ్స్ సాధించి ఫిడే చెస్ రేటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభతో రాణించి ప్రపంచ చెస్ చాంపియన్‌గా విజయం సాధిస్తానని నమ్మకం ఉంది.

గ్రాండ్ మాస్టర్ సాధించడమే కర్తవ్యం

సరయు, చెస్ ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం)



జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాణించి ఫిడే చెస్ రేటింగ్ ఆధారంగా వివిధ హోదాలు అందిపుచ్చుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే క్యాన్‌డిడేట్ మాస్టర్ (సీఎం) ఫిడే మాస్టర్ (ఎఫ్‌ఎం) ఇంటర్నేషినల్ మాస్టర్ (ఐఎం) హోదాను సాధించాను. దీంతో పాటుగా మూడు నార్మ్‌లు వివిధ దేశాల ప్రత్యర్థులతో పాల్గొని ఫిడే చెస్ రేటింగ్ సాధించి గ్రాండ్ మాస్టర్‌గా రాణించాలనేదే నా కర్తవ్యం.

ఇద్దరు గ్రాండ్ మాస్టర్లుగా ఎదగడం గర్వకారణం

బాసిరి వెంకట రాజ్‌గోపాల్, వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు



ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన ఇరిగేసి అర్జున్, రాజవరం రాజారిత్విక్‌లు చిన్న వయస్సులోనే చెస్‌లో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం గర్వకారణం. చిన్నప్పటి నుంచి చెస్ క్రీడ పట్ల పట్టుదలతో సాధనం చేయడం ద్వారానే వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 19: గంజాయిలాంటి మత్తు పదార్థాల నియంత్రణకు వరంగల్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అంబర్ కిషోర్ ఝా మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకు డ్రగ్ కంట్రోల్ టీంను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీం కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల విక్రయాలపై, మత్తుపదార్థాలు సేవించే వారిపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక పోలీసులతో కలిసి ప్రత్యేక టీం పనిచేస్తుందన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. డ్రగ్స్ కిట్‌లతో నిరంతరం రోడ్లపై తనిఖీలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో డీ ఎడిక్షన్ సెంటర్ సైతం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కమిషనరేట్ పరిధిలో పూర్తి స్థాయిలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు వెలుతున్నట్లు అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

కౌన్సెలింగ్‌కు వెళ్లిన నర్సింగ్ ఆఫీసర్లు

ఎంజీఎంలో ఇబ్బందులు పడుతున్న రోగులు

వరంగల్ మెడికల్, జూలై 19: రాష్ట్ర ఆరోగ్యశాఖ సంచాలకుల కార్యాలయ నిర్లక్ష్యం వల్ల నర్సింగ్ ఆఫీసర్ల కౌన్సెలింగ్ రసాభాసగా మారింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పడంతో ఎంజీఎం నుంచి 200లకు పైగా నర్సింగ్ ఆఫీసర్లు గురువారం రాత్రి నుంచే సెలవులు పెట్టి హైదరాబాద్‌కు వెళ్లారు. తీరా అక్కడకు వెళ్లాకా మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ అని ప్రకటించారు. అప్పటికే తప్పుల తడకగా ఉన్న లిస్టుతో కౌన్సెలింగ్ చేసేందుకు అధికారులు ప్రయత్నించగా నర్సింగ్ ఆఫీసర్లు అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ ముందు వేకెన్సీ లిస్టును, స్పౌజ్, వికలాంగులు తదితర ప్రాధాన్యక్రమంకు సంబంధించిన జాబితాలు ప్రకటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌన్సెలింగ్‌కు అడ్డుతగిలారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు కూడా కౌన్సెలింగ్ జరుగుతుందా లేదా అనే అయోమయంలో ఉన్నారు. దీంతో ఎంజీఎంలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థులతో సేవలను అధికారులు నెట్టుకు వస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఎంజీఎం రోగులకు శాపంగా మారింది.

వంగపహాడ్‌లో త్వరలో పోలీసు ఔట్‌పోస్ట్

అడ్డుకునేందుకు కొందరి ప్రయత్నాలు

వరంగల్ క్రైం, జూలై 19: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్ గ్రామ ప్రారంభంలో పోలీసు ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఈ ప్రాంతంలో 2010 నుంచి 2015 వరకు ఔట్‌పోస్ట్ ఉండేది. తర్వాత ఔట్‌పోస్ట్ ఎత్తేశారు. ఓఆర్‌ఆర్‌పై అసాంఘిక కార్యకలాపాలు సాగుతుండటం, మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమదందాలు సాగుతుండటంతో ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలనే ఆలోచన పోలీసులు చేస్తున్నట్లు సమాచారం. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం సాగుతుండటంతో దందాలు చేసేవారు స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయకుండా ముందస్తు ప్రయత్నాలు సాగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తే దందాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో పోలీసులతో బేరసారాలు చేస్తున్నారని తెలిసింది. కొందరు పోలీసులు సైతం ఒక బేరం కుదుర్చుకుని ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయకుండా చూస్తామని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఔట్‌పోస్ట్ ఏర్పాటుపై కాజీపేట ఏసీపీని వివరణ కోరే ప్రయత్నం చేయగా స్పందించలేదు.

26 నుంచి కేయూ బీటెక్ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూలై 19: కాకతీయ యూనివర్సిటీ జూలై 26 నుంచి ఇంజనీరింగ్ (బిటెక్) రెండో, మూడో సెమిస్టర్ నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహ చారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బి.నాగరాజు శుక్రవారం ప్రకటించారు. జూలై 26, 30, ఆగస్టు 1, 3, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెండు, మూడో సెమిస్టర్లకు చెందిన రెగ్యులర్, సప్లిమెంటరీ, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని కోఎడ్యుకేషన్, మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల, మంచి ర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వడ్డెపల్లి, జూలై 19: ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్ల నిధులను కేటాయించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమ్మడిశెట్టి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది ఆటోడ్రైవర్లు ఉన్నారని, వీరి సంక్షేమం కోసం ఆటో డ్రైవర్ బీమా పథకాన్ని రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పినప్పటికీ ఏడునెలలు కావొస్తున్నా కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఆటోడ్రైవర్ల ఆదాయానికి గండి పడిందని పేర్కొన్నారు. వేలాది మంది ఆటోడ్రైవర్లు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.25వేలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం బాలసముద్రంలోని ఏకశిల పార్కులో నిర్వహించే ధర్నాలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇమ్మడిశెట్టి రాజు కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ నేతలు గౌని రాజు, ఆవుల నవీన్‌కుమార్, మస్కే కరుణాకర్, అక్కనపెల్లి అంజయ్య, గోపనబోయిన రాజు, బరిగెల కృష్ణమూర్తి, ఆమంచ ప్రశాంత్, బండారి శ్రీకాంత్, ఆకుల వెంకటేష్, పత్తి నర్సయ్య, తాళ్ల అంజి, వస్కుల రాజ్‌కుమార్, గడ్డం కిరణ్, తప్పెట పరశురాములు, కొట్టె జోసఫ్ పాల్గొన్నారు.

పనితీరును మెరుగుపరుచుకోవాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి


హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న సీఎండీ

హనుమకొండ టౌన్, జూలై 19: పనితీరును మరింత మెరుగుపరుచుకొని వినియోగదారులకు అంతరాయాల్లేని విద్యుత్ సరఫరాను అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. డిస్కమ్ పరిధిలో ఉద్యోగుల ప్రతిభ ఆధారంగా నెలవారీగా అందించే జ్ఞాపికలు, ప్రశంసాపత్రాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన మేనెల జ్ఞాపికలను సీఎండీ ఉద్యోగులకు అందజేశారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రశంసలు అందుకున్న ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని ఇతర ఉద్యోగులు విధి నిర్వహణలో రాణించాలన్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న ఇంజనీర్లకు ఈ సందర్భంగా సీఎండీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో డిస్కమ్ పరిధిలో హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, ఉమ్మడి వరంగల్ ఏడీఈ విభాగంలో హనుమకొండ టౌన్ ఏడీఈ మల్లిఖార్జున్, ఏఈ విభాగంలో యం.ప్రవీణ్ - నక్కలగుట్ట, ఏఈ రమేశ్ - దామెర, నవీన్‌కుమార్ - సుబేదారి, బి.పద్మ - హనుమకొండ రూరల్ డివిజన్, ఐనవోలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ టి.మధుసూదన్, సీజీఎం కిషన్, హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, హనుమకొండ రూరల్ డివిజన్ డీఈ బి. సామ్యనాయక్, ఏడీఈ పరకాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భరత్ ఉద్యమ స్ఫూర్తితో అనేక పోరాటాలు

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క ● ఎంచగూడెంలో సంస్మరణ సభ


స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న విమలక్క భరత్ కుటుంబసభ్యులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జూలై 19 : జనశక్తి నేత భరత్ తన ఉద్యమంలో చూపిన తెగువతోనే గోదావరి లోయ విప్లవోద్యమంలో అనేక పోరాటాలు జరిగాయని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంలో జనశక్తి నేత భరత్ 24వ సంస్మరణ సభను భరత్ కుమారులు కృష్ణ, శ్రీను, కుటంబసభ్యులు, బంధుమిత్రులు శుక్రవారం నిర్వహిం చారు. ముందుగా భరత్ కుమారులు, కుటుంబసభ్యులు, అభిమానులతో కలిసి భరత్ స్తూపం వద్ద నివాళులు విమలక్క అర్పించారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడుతూ తాను అజ్ఞాతంలో పనిచేయలేదని కాని విప్లవాన్ని, అమరత్వాన్ని తన పాటలతో ప్రజల్లోకి తీసుకెళ్లానని పేర్కొన్నారు. విప్లవోద్యమ చరిత్రలో భరత్ పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. నేడు విప్లవోద్యం చీలికలై బలహీనపడుతుందన్నారు. ఉద్యమాలకు తీరని నష్టం జరుగుతుందని ఆవేదన చేందారు. విప్లవకారులు, ప్రజలు బాధపడుతున్నారన్నారు. చీలికలను ఆసరగా చేసుకుని పెట్టుబడి దారులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. పలువురు ఉద్యమకారులు భరత్‌తో ఉన్న తమ అనుభవాలను, నాటి పోరాటలను గుర్తు తెచ్చుకున్నారు. కాగా, విమలక్క, పుష్పక్క, యోచన పాడిన పాటలు ఉత్తేజపరిచాయి, మరికొన్ని కన్నీళ్లు పెట్టించాయి. సభలో మంత్రి సీతక్క కుమారుడు సూర్య, మాజీ జనశక్తి రాజన్న, విష్ణుమూర్తి, జగ్గన్న, సత్తెన్న, రవీందర్, విజయక్క, నాగన్న, ఎన్డీ నాయకులు గౌని అయిలయ్య, శ్రీశైలం, భరత్ బంధువులు బండి పెద్దకుమార్, బండి కుమారస్వామి, జిట్టబోయిన యాకయ్య, సుంకరబోయిన మొగిలి, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఆర్డీఎస్డీఈ ట్రైనింగ్ ఆఫీసర్ విజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఎస్‌టీఈ ఆఫీసర్ విజయ్‌కుమార్

కేయూ క్యాంపస్, జూలై 19: వృత్తి విద్యా కోర్సులు చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని హైదరాబాద్‌లోని రీజికల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఇంటప్రెన్యూర్‌షిప్ ఆఫీసర్ కె.విజయ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం హనుమకొండ వృత్తి విద్యా కళాశాలల ఆవరణలో విద్యార్థులకు అప్రెంటిషిప్ మేళా-2024 నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బెడదం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఇంటర్ ఒకేషనల్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కేంద్ర టెక్నికల్ సంస్థ శిక్షణ సంస్థ ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.7వేలు ఉపకార వేతనంగా శిక్షణ సమయంలో చెల్లిస్తుందని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన స్టేట్ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ రీడర్ బి.రమేశ్ మాట్లాడుతూ.. అభ్యర్థులు ప్రభుత్వ ప్రైవేట్‌రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ), జాబ్‌మేళా కన్వీనర్ ఎ.గోపాల్ మాట్లాడుతూ.. ఇంటర్ స్థాయిలో ఇలాంటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒకేషనల్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్రెంటిషిప్ మేళా కోకన్వీనర్ కె. మాధవరావు, జనగామ నోడల్ ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శాగంటి శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ పి.దివాకర్, డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, జాబ్‌మేళాకు అభ్యర్థులు విశేషంగా హాజరయ్యారు. రిజిస్ట్రేషన్లు చేసుకుని ఉద్యోగాలు పొందారు.


ఘటన స్థలంలో భవాని, దినేష్

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు, జూలై 19: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో వివాహిత మృతిచెందగా, భర్త, కుమారుడు తీవ్రగాయాల పాలైన సంఘటన శుక్రవారం మండలంలోని గూడెప్పాడ్ క్రాస్‌వద్ద జరిగింది. లారీ శరీరం మీది నుంచి పోవడంతో ఛిద్రమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెప్పాడ్‌కు చెందిన బలభద్ర దినేష్ - భవాని(23) దంపతులకు కుమారుడు ప్రద్యుమన్ ఉన్నారు. వీరు వరంగల్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్‌కు వెళ్లిన వీరు.. మధ్యాహ్నం వరంగల్ నుంచి గూడెప్పాడ్‌కు కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి పరకాలకు వస్తున్న లారీ.. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ క్రాస్ వద్ద ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న భవాని, దినేష్‌తో పాటు రెండేళ్ల బాలుడు ఎగిరి పడ్డారు. భవానిపై లారీ ముందు టైరు వెళ్లడంతో పొట్టపగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఆత్మకూరు సీఐ సంతోష్ కుమార్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ భవాని మృతి చెందినట్లు సీఐ తెలిపారు. భర్త దినేష్, కుమారుడు ప్రద్యుమన్‌లు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



వానమబ్బుల వేళ.. పుడమి పచ్చందాల కళ..

ఓ వైపు వానమబ్బులు.. మరోవైపు పచ్చని అందాలను పరుచుకున్న పుడమి. ఆ అపురూప దృశ్యాల కలయిక ఎంతో చూడముచ్చటగా ఉంటుంది కదూ. గుట్టల మాటు నుంచి పొగమంచు తెరల్లా కనిపిస్తున్న ఆ చిరుజల్లుల సవ్వడిలోనే రైతులు, కూలీలు పొలం పనుల్లో నిమగ్నమైన దృశ్యాలు కనులవిందు చేశాయి. ఈ ప్రకృతి రమణీయ దృశ్యం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్ తండా వద్ద శుక్రవారం కనిపించింది.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

జనగామ రూరల్, జూలై 19: కేంద్ర ప్రభుత్వం అవలింభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.వి రమ అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రమ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల అమలును రద్దు చేయాలని, సింగరేణిని ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26,000, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో కార్మికులకు పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీజేపీ బాటలోనే నడుస్తుందన్నారు. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జే. వెంకటేష్, బోట్ల శ్రీను, విజేందర్, సుభాషిణి, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

పనులు పెండింగ్‌లో ఉండొద్దు : కలెక్టర్

కొడకండ్ల జూలై 17: అభివృద్ధి పనులకు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉండొద్దని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలానికి తొలిసారి వచ్చిన ఆయన మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, రేషన్‌షాపు, టీఎస్ఆర్ఎస్ పాఠశాల, పాకాల ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీలను తనిఖీ చేశారు. పాకాల పాఠశాలలో వనమహోత్సవం సందర్భంగా మొక్కను నాటారు. పాకాల. కొడక ండ్ల టీఎస్ఆర్ఎస్ పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వంటగది, మరుగుదొడ్లను, నీటి వసతి, ఆవరణలో పరిశుభ్రతను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాల నాణ్య తను, వంట సరుకుల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పీహెచ్‌సీలో రిజిష్టర్లను తనిఖీ చేసి ప్రతీ పేషెంట్ ఫోన్ నెంబర్‌ను రిజిష్టర్‌లో రాయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను పెంచాలని వైద్య సిబ్బందికి , ఆశా వర్కర్లకు సూచించారు. కొత్తబిల్డింగ్‌లో వర్షానికి నీరు లీకేజ్ అవుతుండటం, గోడలకు పెట్టిన టైల్స్ ఊడిపోతుండటం చూసి పీఆర్ ఏఈతో హరికృష్ణతో మాట్లాడి కాంట్రాక్టర్‌ను పిలిపించి మరమ్మత్తులు చేయించమని ఆదేశించారు. తహసిల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ పెట్ట వద్దని ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు. ధరణిలో పెండింగ్ ఉన్న 13 ఫైళ్ళను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన ఆదేశించారు. ఆయనను స్థానిక ముస్లిం పెద్దలు శాలువాతో సన్మానించారు. డీఈవో రాము, కొడకండ్ల ప్రత్యేక అధికారి రవీందర్, తహసిల్దార్ అంజయ్య, ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి, డీటీ చంద్రమోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్, మండల వైద్యాధికారి హరికృష్ణ, ఎంఎన్‌వో గ్రేస్ కేజియారాణి, ఏపీవో కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



పాకాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న రిజ్వాన్ బాషా షేక్

బీజేపీ మండల ప్రధానకార్యదర్శిగా విష్ణు



విష్ణు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 19: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని శివునిపల్లి గ్రామానికి చెందిన బూర్ల విష్ణు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ మండలాధ్యక్షుడు సట్ల వెంకటరమణ విష్ణుకు నియామక పత్రం అందించారు. తనకు పదవి రావడానికి సహకిరంచిన జిల్లా, మండల నాయకులకు విష్ణు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జఫర్‌గడ్, జూలై 19 : మండలంలోని ఓబులాపూర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన మొగులగాని వజ్రమ్మ మృతదేహం వద్ద జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు నివాళులు అర్పించారు. పార్టీ ప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి ఆయన బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబీకులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. పరామర్శలో నాయకులు మొగులగాని కుమారస్వామి, కె.కుమారస్వామి, వాంకుడోత్ శంకర్, లక్ష్మయ్య, అలుగోజు అనిల్‌కుమార్, గబ్బెట శివయ్య, వంగాల దయాకర్, పచ్చిమట్ల యాదయ్య, మొగులగాని దర్గయ్య, అశోక్, సాంబరాజు తదితరులు ఉన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

జనగామ కల్చరల్, జూలై 19: కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురాం డిమాండ్ చేశారు. ఈ మేరకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం భువనగిరి కలెక్టరేట్‌లో కలుసుకుని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడుతూ ఈ అంశం పై పార్లమెంటులో మాట్లాడతానని, కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఈ నెల 29, 30, 31 తేదీలలో జరుగు మహాధర్నాకు సైతం హాజరవుతానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సాధన సమితి జిల్లా చైర్మన్ కడారి వెంకటేష్, గౌరవాధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, గట్టుగల్ల సంజీవ, పిడుగు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

పరిరాలను పరిశ్రుభంగా ఉంచుకోవాలి

జనగామ రూరల్, జూలై 19: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎలాంటి రోగాలు దరిచేరవని జనగామ మునిసిపాలిటీ పరిధి 2వ వార్డు కౌన్సిలర్ వాంకుడోత్ అనిత అన్నారు. క్లిన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 2వ వార్డులో పర్యటించి కాలనీవాసులకు దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై ఆవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉంటే నీటిలో దోమలు వృద్ధి చెందడంతో డెంగీ, మలేరియా లాంటి విషజ్వారాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు అనిత, ఆర్పీ సంధ్య, జవాన్ బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల సహకారం మరువలేనిది

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 19: గత ఐదేళ్ల కాలం పాటు గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిదని మండలంలోని పాంనూర్ గ్రామానికి చెందిన తాజామాజీ ఎంపీటీసీ ఇనుగాల రజిత-రాజిరెడ్డి తెలిపారు. ఇటివల ఎంపీటీసీ పదవికాలం ముగియగా శుక్రవారం జీపీ కార్యాలయంలో ఎంపీటీసీ దంపతులును గ్రామస్తులు, నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన పై నమ్మకంతో గ్రామస్తులు గెలిపించినప్పటికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు చేయలేకపోయామని తెలిపారు. అయినప్పటికి గ్రామస్తులు తనను ఏనాడు ప్రశ్నించలేదన్నారు. రానున్న రోజుల్లో గ్రామస్తులకు తన వంతుగా అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి సీడీపీవో ఫ్లోరెన్స్, మాజీ సర్పంచ్ కోతి రేణుక-రాములుగౌడ్, సెక్రటరీ సునిల్, శ్రీధర్‌గౌడ్, మహేందర్ రెడ్డి, మహిళ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

నర్మెట, జూలై 19 : మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో చేపట్టిన పనులపై మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 15 వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదికను అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలోని 17 గ్రామ పంచాయతీలు, 16 హబిటేషన్‌లలో చేపట్టిన 564 పనులపై నివేదికలను చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.34270518 కోట్లు ఖర్చు చేయగా ఉపాధి హామి కూలీలకు 3,01,22839 కోట్లు, రూ. 41,47679 లక్షలు మెటీరియల్‌కు ఖర్చు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఉపాధి హామి సిబ్బంది పనుల్లో చేసిన తప్పులు, కొలతల్లో తేడాలు, చెల్లింపుల్లో తేడాలపై తనిఖీ బృందం వివరాలను బహిర్గతం చేసింది. దీనిపై కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది వివరణ ఇచ్చారు. చెల్లింపులు, పలు తప్పిదాలు చేసిన టీఏ, ఎఫ్ఏ, ఈసీ, కార్యదర్శులకు కలిపి రూ. 40770 ఫైన్ వేసి రికవరికి ఆదేశించారు. ఈసీకి రూ. 3909, టీఏలకు రూ. 22541, కార్యదర్శులకు రూ. 8527, ఎఫ్ఏలకు రూ. 5793 ఫైన్ వేశారు. అనంతరం అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో వంద శాతం మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ గాదెపాక రాజు, డీవీవో నాగేశ్వర్, ఏడీవీవో సంధ్య, ఎంపీడీవో సంధ్య, ఏపీవో రమాదేవి, ఈసీ లింగయ్య, సోషల్ ఆడిట్ బృందం, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంబిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ రూరల్, జూలై 19: జనగామ కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకునే ప్రక్రియలో పొరపాట్లను సవరించేందుకు ప్రజాపాలన సేవా కేంద్రం ఎంతోగాను ఉపయోగపడుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

నర్మెట, జూలై 19 : కట్టెకోత మిషన్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి చెయ్యి ప్రమాదవశాత్తు మిషన్‌లోకి జారడంతో చెయ్యి నుజ్జు నుజ్జు(తీవ్ర గాయం) అయిన సంఘటన శుక్రవారం మండలకేంద్రంలో చోటు చెసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రంలోని కట్టెకోత మిషన్‌లో పని చేస్తున్న కార్మికుడు చల్లూరి శ్రీరాములు కట్టెకోత మిషన్‌లో కట్టె మొద్దులను కోస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమ చెయ్యి జారి మొద్దుతో పాటు మిషన్‌లోకి వెళ్లడంతో అరచెయ్యి మొత్తం నుజ్జు నుజ్జు అయింది. వెంటనే 108లో జనగామ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం హైద్రాబాద్‌లోని ఓ ప్రవైట్ ఆసుపత్రికి తరలించారు.

చేపల మార్కెట్‌లను ఏర్పాటు చేయాలి



పాలకుర్తిలో మాట్లాడుతున్న పద్మ

పాలకుర్తి, జూలై 19 : జిల్లా, మండల కేంద్రాల్లో అధునాతన హోల్ సేల్, అండ్ రిటేల్ చేపల మార్కెట్లను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, హైదరాబాద్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమైఖ్య జిల్లా చైర్మన్ కొప్పు పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో తెలంగాణ మత్స్య కారులు, మత్స్య కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశానికి మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదరి పద్మ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 600 మత్స్య మహిళా సొసైటీలు ఉన్నాయని, ప్రతి సొసైటీకి ప్రభుత్వం రూ. 20 లక్షల రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. చేపలు పౌష్టికాహారంగా ఉపయోపడుతాయని అన్నారు. మత్స్య కార్మిక మహిళలు ఎంతో శ్రమించి చేపల పెంపకాన్ని చేపడుతున్నట్లు పేర్కో న్నారు. మార్కెట్ సౌకర్యం లేమితో రోడ్లపైనే చేపలు విక్రయిస్తూ జీవినం సాగిస్తున్నారని, దీంతో రోడ్లపై ప్రమాదాలు జరుగు తున్నాయని అన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి మత్స్య కార్మికుడికి రూ. 5 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు మత్స్య మహిళల చైతన్యం కోసం జిల్లాల వారిగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 12న చాకలి ఐలమ్మ గ్రామమైన పాలకుర్తిలో సదస్సును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్, తరాల చంద్రబాబు, చంద్రయ్య, మంజుల, పిట్టల స్వరూప, లక్ష్మీ, నాగజ్యోతి, యాదలక్ష్మీ, చొప్పరి బిక్షపతి, దండు కుమార్, అన్నెపు జోడు యాకయ్య, దాసరి సోమన్న ఉన్నారు.

చేర్యాల మార్కెట్ చైర్‌పర్సన్‌గా నల్లనాగుల శ్వేత



బచ్చన్నపేట, జూలై 19: సిద్దిపేట జిల్లా చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి బచ్చన్నపేట మండలం కట్కూరు గ్రామానికి చెందిన నల్లనాగుల శ్వేత వెంకటాచారిని వరించింది. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి విధేయులుగా ఉండటంతో ఈ పదవి దక్కింది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఉన్న సమయంలో ఈ మండలం నుంచి నారాయణపూర్‌కు చెందిన మాసపేట రవీందర్‌రెడ్డి చైర్మెన్‌గా పనిచేశారు. మరోసారి ఈ మండలానికి చైర్‌పర్సన్‌గా అవకాశం దక్కటంపై కాంగ్రెస్ శ్రేణుల్లో, మండల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తకు, ఓ సాదారణ రైతు కుటుంబానికి చెందిన వ్యక్తికి పదవులు లభిస్తాయనటానికి ఇదే ఉదాహరణని నేతలంటున్నారు.

కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్య తీసుకోవాలి

జనగామ రూరల్, జూలై 19: తాము కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న చీటకోడూర్ పీఏసీఎస్ చైర్మన్ చిర్ర శ్రీనివాస్‌రెడ్డిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని చిర్ర హనుమంత రెడ్డి మల్లికాంబ దంపతులు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2020లో వంగ రాజేశ్వర్ వద్ద నుంచి రెండు ఎకరాల భూమి కొనుగోలు చేయడానికి 80శాతం అడ్వాన్స్ నగదు ఇచ్చామన్నారు. అదే సమయంలో రాజేశ్వర్ మృతి చెందడంతో మూడు నెలల తర్వాత రాజేశ్వర్ భార్య శారద, కుమారుడు వంశీకృష్ణను భూమి రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా వారు తమకు తెలియదని సమాధానం చెప్పారన్నారు. దీంతో కోర్టులో పిటిషన్ వేయగా కోర్టు కూడా తమకు రిజిస్ట్రేషన్ చేయాలని ఆర్డర్ కాపీ ఇవ్వడంతో శారద, వంశీకృష్ణ తమకు భూమి రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. గతంలో వరంగల్ సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేస్తే తమకు న్యాయం చేయాలని చెప్పినప్పటికీ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అర్చక, ఉద్యోగుల సంఘం నాయకులు డీవీఆర్ శర్మ

పాలకుర్తి, జూలై 19 : రాష్ట్రంలోని దేవాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డీవీఆర్ శర్మ కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా డీవీఆర్‌శర్మ మా ట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీలు చేయకూడదని, ఆగమాలు మాత్రమే కాకుండా స్థానికంగా ప్రతి దేవాలయంలో ఆచారాలు పద్ధతులు ఉంటాయని సీఎం రేవం త్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

అర్చకులు ఎదుర్కొంటున్న సమస్య లపై వివరించారు. భగవంతుని భక్తుడి కి అనుసం ధానకర్తలుగా అర్చకులు, ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు బదిలీలు చేయకూ డదని సీఎం సెక్రటరీ సీనియర్ ఐఏఎస్ శేషాద్రిని ఆదేశించారని శర్మ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం చేశారు. అర్చకుల బదిలీలను రద్దు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఆనంద్ శర్మ తదితరులు ఉన్నారు.

పాన్ షాప్‌లో పోలీసుల తనిఖీ



పాన్ షాపు వద్ద తనిఖీ చేస్తున్న ఎస్సై శ్వేత , సిబ్బంది

తరిగొప్పుల, జూలై 19: మండల కేంద్రంలోని హనుమాన్ పాన్‌షాపులో తరిగొప్పుల ఎస్సై అయ్యాల శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా పోలీసులు పాన్ షాప్‌లో ప్రభుత్వ నిషేధిత 48 అంబర్‌ప్యాకెట్లు, 12 మిరాజ్ ప్యాకెట్లు, 12 ఆర్ఆర్ ప్యాకెట్లు, 66 బాబా ప్యాకెట్లు, 10 స్వాగత్ ప్యాకెట్లను స్వాదీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం ఎస్సై శ్వేత మాట్లాడుతూ పాన్ షాపులో ప్రభుత్వ నిషేదిత గుట్కా, పొగాకు అమ్ముతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు పాన్ షాపులో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ తనిఖీల్లో సుమారుగా రూ. 2000 విలువైన గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాదీనం చేసుకుని నిర్వాహకుడు బానోతు అనిల్ (24) కేసు నమోదు చేశామని చెప్పారు.

ఆట వస్తువులు, నోటు పుస్తకాల పంపిణీ

పాలకుర్తి, జూలై 19 : మండలంలోని వావిలాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంటా రవిందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆట వస్తువులతో పాటు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న 130 విద్యార్థులకు చేతి రాత బాగుండాలని హిందీ, తెలుగు, ఇంగ్లీష్ ప్రతీ రోజు రాజేందుకు రూ. 25 వేలు ఖర్చు చేసి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అంతే కాకుండా చదువుతో పాటు ఆటల్లో రాణించాలని, మానసిక ఒత్తిడి నుంచి ఆటలు కూడా అవసరమని అందు కోసం ఆట వస్తువులను పంపిణీ చేశారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి



గొట్టె వెంకటయ్య మృతదేహంపై పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్మెట, జూలై 19 : మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టె వెంకటయ్య(57) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. కాగా మృతదేహంపై కాంగ్రెస్ జెండా కప్పి, మృతుడి కుటుంబాన్ని డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. వెంకటయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరీదుల యాదయ్య, భూక్య జయరాం, చెవుల పరుశరాములు, బండి అశోక్, గొల్లపల్లి బాలచందర్, ప్రజ్ఞాపురం శ్రీధర్, కాలువ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైరింగ్ యూత్ ఆఫ్ ఇండియా అవార్డుల ప్రదానం



అవార్డు అందుకున్న వ్యాసిక్ స భ్యులు

బచ్చన్నపేట, జూలై 19: బచ్చన్నపేట మండలం కట్కూరు గ్రామానికి చెందిన నిడిగొండ నరేష్‌కుమార్ స్థాపించిన వాస్విక్ ఫౌండేషన్‌కు అరుదైన గుర్తింపు లభించింది. సంస్థ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో గుర్తించిన నేషనల్ హ్యూమన్ వెల్ఫేర్ కౌన్సిల్ వాస్విక్ ఫౌండేషన్ చైర్మెన్ నరేష్‌కుమార్‌తో పాటు వైస్ చైర్మెన్ నూకల భాస్కర్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు హేమంత్‌లకు ఇన్‌స్పైరింగ్ యూత్ ఆఫ్ ఇండియా అవార్డ్స్ ప్రకటించి శుక్రవారం అందించారు. న్యూఢిల్లీలోని ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వాస్విక్ ప్రతినిధులకు అందజేశారు. దేశవ్యాప్తంగా వందమందికి, తెలంగాణాకు చెందిన 10 మందికి ఈ అవార్డులు అందజేయగా ఇందు లో ముగ్గురు వాస్విక్ ఫౌండే షన్‌కు చెందినవారు కావడంతో విశేషం. వ్యక్తిగత జీవితంలో పదిశాతం సమ యాన్ని లేదా పదిశాతం సంపద గాని సమా జ శ్రేయస్సుకు వెచ్చించాలని ఈ సందర్భంగా నరేష్‌కుమార్ కోరారు.

మహిళలు రుణాలను వినియోగించుకోవాలి

రఘునాథపల్లి, జూలై 19: మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఏ రంగంలోనైనా అంకితభావంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఐకేపీ ఏపీఎం కె.సారయ్య అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం జరిగిన క్రాంతి గ్రామైఖ్య సంఘం 15వ వార్షికోత్సవ మహాసభకు సంఘం అధ్యక్షురాలు మినుముల లక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రఘునాథపల్లి ఎస్‌బీఐ మేనేజర్ షైనావతి, ఐకేపీ ఏపీఎం సారయ్య హాజరై మాట్లాడారు. ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ మనోజ్, శివారెడ్డి, సీసీ ఎల్లస్వామి,వివోఏ పద్మావతి, రంగు శ్రీవాణి, శిరీష పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న మహిపాల్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు

జఫర్‌గడ్, జూలై 19: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి అన్నారు. పీఆర్‌టీయు మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన మండలంలోని తిమ్మంపేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కోర్టుల్లో పలు కేసులు ఉన్నప్పటికీ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రతినిధులు సీఎంతో మాట్లాడి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయు చిత్తశుద్ధితో పాటుపడుతు ందన్నారు. ఏటా నిర్వహించే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతినిధులందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన కోరారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కాగా, శుక్రవారం సంఘం ప్రతినిధుల బృందం మం డలంలోని కూనూరు, తిమ్మంపేట, రఘునాథ్‌పల్లి, తదితర పాఠశాలలను సందర్శించి సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు కె.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి జి.సురేశ్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు సదానందం, ప్రతినిధులు కె.సుధాకర్, సోమయ్య, పెద్దిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లను నింపాలి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 19: గురుకులాల్లో ఖాళీగా ఉన్నటువంటి ఇంటర్ మీడియట్ విద్యార్థుల సీట్లను వెంటనే నింపాలని స్వేరోస్ రాష్ట్ర నాయకుడు, ఎంహెచ్‌పీఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఇసురం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలను నాయకులతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఇంటర్మీడియట్ వివిధ గ్రూపుల్లో చదివే విద్యార్థులు గ్రూపుల వారిగా 10 నుంచి 15మంది విద్యార్థులే ఉన్నారని తెలిపారు. జూలై మాసం పూర్తి కావస్తున్న విద్యార్థులను తీసుకోవడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. అధికారులకు బదిలీల పైన ఉన్న శ్రద్ధ విద్యార్థులను చేర్చుకోవడంలో లేదన్నారు ఇప్పటికైన ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా గురుకులాల్లో ఇంటర్ విద్యార్థులును తీసుకోవాలని డిమాండ్ చేశారు. చాడ వెంకటస్వామి, ఎడ్ల రాజేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో రుణమాఫీ సంబురాలు



రఘునాథపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జఫర్‌గడ్, జూలై 19 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రైతు పంట రుణాల మాఫీ నేపథ్యంలో గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు, రైతులు సంబురాలు జరుపుకుంటున్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పుగల్లు, సూరారం, తదితర గ్రామాల్లో స్థానిక సెంటర్లలో సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కో-ఆర్డినేటర్ పోరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ మండల నాయకులు గంగాధరి యాదగిరి, గాదెపాక భాస్కర్, కోరుకొప్పుల రాజు, సాంబరాజు, లెంకల రాజు, జయపాల్‌రెడ్డి, బేతి రాజిరెడ్డి, రత్నం, బుచ్చయ్య, యాట అశోక్, దోరి శ్రీధర్, రాపర్తి యాకయ్య, యాతం నర్సింహులు, ఎన్నకూస యాకయ్య, షైదాసు ప్రభాకర్, గోనె సంపత్, సతీష్ పాల్గొన్నారు.

- రఘునాథపల్లి : రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసినందుకు మండలంలోని కంచనపల్లి సెంట్రల్ బ్యాంకు ఎదురుగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయితా జయరాములు, లోనే రవిందర్, వెంకటేశ్వర్లు, రంగోజు ఈశ్వరయ్య, గోపు శౌరెడ్డి, పురుషోత్తం, కొలిపాక మల్లేష్ పాల్గొన్నారు.
- బచ్చన్నపేట : ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించటంపై శుక్రవారం మండల కేంద్రంలో పలువురు సీఎం ఫ్లెక్సీకి ఆర్ఎంపీలు క్షీరాభిషేకం చేశారు. ప్రస్తుతం ఆర్ఎంపీలపై వేధింపులు ఎక్కువ కావడంతో సీఎం తీసుకున్న నిర్ణయం తమకు ఉపశమనం కలిగించిందని వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కృష్ణ, అబ్దుల్ సత్తార్, భాస్కర్, గాలి కృష్ణ, సుదర్శన్‌రాజు పాల్గొన్నారు.
- నర్మెట : రైతులకు ఇచ్చిన రైతు రుణమాఫిని అమలు చేసిన సందర్భంగా మండలంలోని మచ్చుపహడ్ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి గ్రామ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ గొల్లపల్లి కుమారస్వామి, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పరీదుల యాదయ్య, డీసీసీ కార్యదర్శి భూక్య జయరాం, మండల నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ మండలాధ్యక్షుడిగా రాజ్‌కుమార్

చిలుపూర్, జూలై 19 : కబడ్డీ అసోసియేషన్ మండలాధ్యక్షుడిగా చిలుపూర్ మాజీ సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ జిల్లా చైర్మన్ వై. కుమార్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా చుక్కమ్మ (మల్కాపూర్ పీడీ), భూక్య సంజీవ, ప్రధాన కార్యదర్శిగా అన్నెపు కుమార్ (రాజవరం పీఈటీ), సహాయ కార్యదర్శులుగా అజయ్‌కుమార్, దిలీప్‌కుమార్, కోశాధికారిగా రణదీప్, ఈసీ మెంబర్లుగా ఉదయ్‌కిరన్, రమేష్‌లు ఎన్నికయ్యారు.

జంగాకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



జంగా రాఘువ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 19: రాష్ట్ర ఆయిల్ సీడ్స్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జంగా రాఘవరెడ్డిని శుక్రవారం పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండలోని జంగా నివాసంలో మాజీ మార్కెట్ చైర్మన్ కారింగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. జంగాను సన్మానించిన వారిలో మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి చేరాలు, పొన్న శ్రీనివాస్, అరుణ్‌లాల్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.